53.

# ప్రపంచములోని సంపదలన్నిటి కంటె మానవుడే అత్యంత విలువైనవాడు

అస్థిరం జీవనం లోకే అస్థిరం యౌవనం ధనం
అస్థిరం దారాపుత్రాది సత్యం కీర్తి ద్వయం స్థిరం

ఏమితాకొని వచ్చె ఏమితాకొని పోవు
పుట్టినప్పుడు నరుడు గిట్టినపుడు
ధనము ఎచ్చటి కేగు తానేగు నెచ్చటికి
తెలుపరయ్య మీరు తేటముగను.

విద్యార్థులారా! విద్యాపోషకులారా! విద్యాభిమానులారా!

**మితిమీరిన ధనాశ, అధికారము మతి చెడగొడుతుంది**

నేటి ప్రపంచములో మానవుని జీవితము రెండు విధములైన ఉన్మాదముతో కూడి ఉంటున్నది. ఒకటి ధనోన్మాదము, రెండవది అధికారోన్మాదము. రెండూ వేరు కాదు. ఒక విత్తనములో రెండు బద్దల వంటివి. ధనముంటే అధికారము సంపాదించవచ్చు. అధికారముంటే ధనము సంపాదించ వచ్చు. ఈ రెండూ కూడి ఉండిన మానవునకు అమితమైన ఉన్మాదమే. జీవితములో ధనము అవసరమే. అధికారము అవసరమే. కానీ అది ఒక పరిమిత మైనదిగా ఉండాలి. మితిమీరిన ధనాశ, మితిమీరిన అధికారము మతి చెడగొడుతుంది. ఈ కార్యక్రమములో finance management అన్నారు. ఏమిటీ ధనము? ధనము అంటే ఏమిటి? కేవలం currency నోట్సా? కాదు కాదు. మనము సంపాయించిన దాన్ని ధనము అంటారు. జ్ఞానము ధనమే. విద్య ధనమే. ఆరోగ్యము ధనమే. సంపద ధనమే. ఇవన్నీ మనము సంపాయించుకొన్నవే. ఈ ధనము లేక క్షణమైనా మానవుడు జగత్తులో నిలువజాలడు. ధనము అవసరమే.

sri sathyasaivachanamrutam

**మానవ మనుగడకు ఆధ్యాత్మిక చైతన్యము అత్యవసరము**

అయితే, మొదట మానవుడు చేయవలసిన కర్తవ్యము ఏమిటి? దీనిని ఆంగ్లబాషలో Man మేన్ అన్నారు. M = Mind control, A = Atma దర్శనం. N = నిర్వాణము. మానవుడు ముఖ్యముగా ఈ మూడింటి ఏకత్వముతో కూడినవాడు. మైండ్ కంట్రోలు, ఆత్మ దర్శనము, నిర్వాణస్థితి. ఈ మూడు మానవుని యొక్క సత్యము, నీతిపైన ఆధారపడి ఉంటున్నవి. ఉత్తమ బాలబాలికలు లేని దేశము శ్రేయోదేశము కానేరదు. చిత్తశుద్ధి, శీలసంపత్తి లేని సమాజము లోపల ఉత్తమ బాలబాలికలు ఉండలేరు. నీతికి పునాదియే లేకుండిన శీలము అభివృద్ధి కానేరదు. ఆధ్యాత్మిక చైతన్యమే లేకుండిన జాతి (సర్వోపనిషత్ సారము) నిల్చదు. సర్వజాతియొక్క మానవత్వము ఏమాత్రము అభివృద్ధి కానేరదు. లోక కళ్యాణమునకు, లోకశాంతికి మానవ మనుగడకు ఈ ఆధ్యాత్మిక చైతన్యము అత్యవసరము. దీనినే వేదమందు **"సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం"** అన్నారు. సత్యాన్ని పలుకు. ఇది నైతికము. ఆ సత్యమును ప్రియమైన రీతిగా పలకాలి. అదియే ధార్మికము. నబ్రూయాత్ సత్యమప్రియం. ఇదే మానవునకు లోకసంబంధమైన ధర్మము. ఇదే ఆధ్యాత్మికము. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక దీపికతో కూడినవాడు మానవుడు. ఇలాంటి మానవత్వమును ఈనాడు భౌతిక భోగభాగ్యముల నిమిత్తమై వినియోగించుకుంటున్నారు.

**మానవుడు విలువ కోల్పోవటంచేతనే సమస్త పదార్థముల విలువ అధికమవుతూ వచ్చింది**

మానవుడనగా అజ్ఞానమైనవాడు కానేరడు. మా-న-వ. ఈ మూడు అక్షరములందున్న అర్థమును మనం గుర్తించుటకు ప్రయత్నించాలి. మ-అజ్ఞానము, న-లేకుండా, వ-వర్తించటం. అజ్ఞానము లేకుండా వర్తించేవాడే మానవుడు. ఇలాంటి అజ్ఞానరహితుడైన మానవునికి జ్ఞానమెందుకు? జ్ఞానమనగా ఏమిటి? కేవలం గ్రంథ పరిచయము జ్ఞానము కాదు. ఏకాత్మ దర్శనం జ్ఞానం. దీనినే వేదం **'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'** అనింది. ఇలాంటి మానవత్వమును సక్రమమైన రీతిలో పోషించకున్న పరిపూర్ణ మానవుడు కానేరడు. ఈనాటి మానవునియందు అమితమైన వాంఛలు పెరిగిపోతున్నాయి.

sri sathyasaivachanamrutam

ప్రతి మానవుడు, ప్రతి విద్యార్థి, ప్రతి విద్యావంతుడు ధనము యొక్క విలువ తగ్గిపోయినదని విచారిస్తున్నాడు. రూపాయి వెల తగ్గిపోయింది. డాలరు వెల తగ్గిపోయింది. పౌండు వెల తగ్గిపోయింది. ఈవిధంగా తగ్గినదాన్ని గురించి ఎక్కువగా విచారిస్తున్నారు. Man is valuable than all the wealth of the world. అన్నింటికి మానవుడు విలువనందిస్తున్నాడు. రూపాయికి, పౌనుకు, డాలరుకు వెల యిచ్చేవాడు ఎవరు? బంగారుకు, డైమండ్‌కి వెలనిచ్చేవాడు ఎవరు? భూమికి వెల యిచ్చేవాడు ఎవరు? మానవుడే. అన్నింటికి విలువనిచ్చే మానవుని విలువ తగ్గిపోయినప్పుడు మానవుడు యోచించటం లేదు. యీనాడు తగ్గినది మానవుని విలువే. మానవుడు విలువ కోల్పోవటంచేతనే సమస్త పదార్థముల విలువ అధికమవుతూ వచ్చింది. యావత్ప్రపంచమంతయు ఒకవైపున, మానవుడు మరొకవైపున ఉండినప్పుడు balance అటూ యిటూ ఉంటుంది. కాబట్టి, మానవుడు అత్యంత విశిష్టస్వరూపుడు. ప్రపంచంలోను అన్ని సంపదల కంటే ఎంతో విలువైనవాడు మానవుడు. ఇట్టి మానవుడు ఈనాడు తన విలువను కోల్పయి ధనము విలువ కోల్పోయినాము, భూమి విలువ కోల్పోయినాము, బంగారు విలువ కోల్పోయినామని విచారించటం ఎంత వెఱ్ఱితనము.

**ధనమును సద్వినియోగపరచుకున్నప్పుడే సరైన ఫలితము మనకు లభిస్తుంది:**

ధనము కావాలి. కానీ పరిమితమైన రీతిలో దాన్ని ఉంచుకోవాలి. దానిని దుర్వినియోగం చేయకూడదు. Misuse of money is evil. ఈవిధంగా ఉపయోగించుకోటంచేతనే అన్ని దేశములందు ఈ money value చాలా తగ్గిపోతున్నది. సద్వినియోగపర్చటం లేదు. 10 రూపాయల వ్యాపారం చేయాలనుకుంటే 10వేల రూపాయలు అప్పు తీసుకుంటారు. ఎందుకు 10 వేలు. నీ వ్యాపారం 10 రూపాయలు అయితే అప్పు 10 వేలు తీసుకోటం. ఇది ఎవరి దోషము? నీకు పదివేల రూపాయలు అప్పు తీసుకోటం సహజం కావచ్చు. కానీ తన బిజినెస్సు గుర్తించి అప్పు యిచ్చే బ్యాంకర్సు తగిన విచారణ చేయాలి. ఈనాటి బ్యాంకర్సులో కూడా దోషముంటున్నది. ఒక్కరిది మాత్రము కాదు. తీసుకున్న ధనాన్ని సద్వినియోగం చేస్తున్నారా లేదా అనే విచారణ జరపాలి. పూర్వము South Korea, Indonesia వీరందరు అధికంగా అప్పులు చేశారు. వారు

srisathyasai vachanamrutam

తీసుకున్న ధనము ఏ నిమిత్తమై అందుకున్నారో ఆ కార్యమునకు వినియోగ పెట్టారా? అని విచారించినచో ఏమాత్రం వినియోగించ లేదు. భుజించి కూర్చున్నారు. కనుక, ఈ దేశములు అప్పుల పాలైపోయాయి. తీసుకున్న ధనమును సద్వినియోగపరచుకున్నప్పుడే సరైన ఫలితము మీకు లభిస్తుంది. ధనము ఒక ఎరువు వంటిది. ఈ ఎరువును ఒకే దగ్గర పెట్టినప్పుడు కుళ్లి కృశించి దుర్గంధము వ్యాపిస్తుంది. దానిని పంటలో చల్లినప్పుడే అభివృద్ధి అవుతుంది. తాను కూడా సుఖాన్ని అనుభవిస్తాడు. ఈనాడు సంపాయించిన ధనమును మానవుడు కూడబెట్టి, కూడబెట్టి కుళ్ళ పెడుతున్నాడు. కనుకనే దీనియొక్క ఫలితాన్ని తాను అందుకోలేకపోతున్నాడు. ఒక చిన్న ఉదాహరణ. ధనము కాళ్లకు వేసుకునే షూస్ వంటివి. కానీ యీ షూస్ పాదములకు సరి పోయినప్పుడు చక్కగా నడచవచ్చును. Loose అయినా నడవలేరు, tight అయినా నడవలేరు. కాబట్టి ధనము ఎంత అవసరమో అంత ఉండినప్పుడే జీవితము సక్రమంగా నడుస్తుంది. ఈనాడు ధనమును అధికంగా పెంచుకొంటే loose అయింది. కనుక నడవలేకపోతున్నాడు. జీవితములో శాంతిని పొందలేకపోతున్నాడు. పూర్తిగా ధనమును దుర్వినియోగం చేయటంచేత tight అయిపోయింది. ఈ tight అయినప్పుడు కూడా తనకే బాధ కలుగుతున్నది. కనుక, ధనమును మీరు సరియైన మార్గములో వినియోగించాలి. ఇంతేకాక మీరు ధనము సంపాయించాలనుకుంటే మీ స్వబుద్ధితో, స్వశక్తితో, స్వప్రయత్నంతో సరియైన మార్గములో సంపాయించాలి. కానీ పరులయొక్క ప్రోద్బలముచేతనో పరులయొక్క ఉత్సాహ ప్రోత్సాహముల చేతనో అనేక విధములుగా అప్పులు చేసి తాము అనేక చిక్కులకు గురౌతున్నారు మానవులు. పిల్లలకు చక్కగా తెలుసును. వారి కంటె మేము, మా కంటే వారు అభివృద్ధి కావాలనే ఆశచేత, దురాశచేత తాము దుఃఖానికి గురౌతున్నారు. ధనము విషయములో పోటీ చాలా చెడ్డది. విద్యార్థియైన వాడు తన స్వశక్తిచేత సంపాయించే యుక్తిని, శక్తిని అధ్యాపకులు అందించాలి. కానీ, ఈనాడు తన కాళ్లపై తాను నిలబడగలిగిన శక్తిని బోధించలేకపోతున్నారు అధ్యాపకులు. Self confidence కావాలనుకున్నప్పుడు తాను self dependent కావాలి. ఈ self confidence, self dependence ఉండినప్పుడే self satisfaction కల్గుతుంది. Self satisfaction తో self support వస్తుంది. ఈనాడు self

srisathyasaivahini.org

support లేదు. Self confidence లేదు. Self satisfaction లేదు. ఇంక ఈవిధంగా సంపాదించి ప్రయోజనం ఏమిటి? ధనము, ధనము. ధనమునకు ఏమీ తక్కువ లేదు. కానీ, దానిని సద్వినియోగపరచకునే బుద్ధి, శక్తులు తగ్గి పోయినాయి. కనుక ఈనాడు market నందు గానీ, బ్యాంక్సునందు గానీ shortage ఎక్కువై పోయింది. చాలామంది ధనమును tax క్రింద ఇస్తున్నారు. బయట ప్రదేశానికి చేరనివ్వకుండా చూచుకోవాలి ప్రభుత్వము. మన దేశంలో ఉంటే ఎక్కడికీ పోదు మన దేశంలోనే ఉంటుంది. కానీ తాను సాధించిన, సంపాయించిన ధనమును ఈనాడు విదేశాల్లో పెడుతున్నారు. ఈ విదేశాల్లో పెట్టిన ధనము తనకు అబ్బదు, దేశానికి సుఖము లేదు. కనుక ధనమునకు ఏమీ తక్కువలేదు. దీనిని దుర్వినియోగపరచుకోటం అధికమైపోయింది. ఆ దుర్వినియోగం చేత ఈనాడు దేశము దుఃఖముల పాలైపోతున్నాది. కనుక ప్రతి కాసును సద్వినియోగపర్చుకోవాలి. ఈ సద్వినియోగపర్చుకునే విధానము పెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలి.

ఈనాడు డాలరు విలువ పెరిగింది. పౌను విలువ పెరిగింది. రూపాయి విలువ తగ్గింది. పెరగటానికి కారణం ఏమిటి? నిజంగా చూస్తే రూపాయి విలువ తగ్గటానికి ఏమాత్రం అవకాశం లేదు. ఈనాటి మానవుని మనస్సు అంత బలహీనంగా మారిపోయింది. మానసిక పటుత్వము తగ్గిపోయింది. ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. ఈ మధ్యనే ఎలక్షన్లు జరిగినాయి. ఈ ఎలక్షన్ల లోపల ఒక పార్టీవారు నెగ్గినారు. ప్రభుత్వము లోని పార్టీ ఓడిపోయింది. ఓడిపోవటం, గెల్వటం సర్వసామాన్యమే. జయాప జయములు సర్వ సాధారణంగా జరుగుతుంటాయి. కానీ ప్రభుత్వము మారుతూనే రూపాయి విలువ తగ్గిపోయింది. దీనికి కారణం, బలహీనమైన భావాలు మానవునిలో అభివృద్ధి అవడమే. ఒక పార్టీ గెలుపుతో ఇంకొకపార్టీ ఓటమితో ఎట్లా రూపాయి విలువ తగ్గిపోతుంది. మనుషులు మారినంత మాత్రమున; పార్టీలు మారినంత మాత్రమున ధనము మారుటకు అవకాశము లేదు. ఇది మానవుని యొక్క iఊహాగానమే. ఊహలు, బలహీనతలు ఈవిధంగా అభివృద్ధి పరచుకుంటున్నారు ఈనాటి మానవులు. ఒక్క మనిషిపైన ధనము ఆధారపడలేదు. ఈవిధముగా మానవుని మనస్సు బలహీనం చేసుకోటం చేత ధనము విలువ తగ్గిపోవటానికి అవకాశం ఏర్పడింది. మానవుడు ధైర్య సాహసంతో ముందంజ వేయాలి. Life is a chal-

srisathyasaivachanamrutam

lenge, meet it అన్నింటిని ఎదుర్కొనే శక్తిని సంపాయించాలి.

**'సుఖ దుఃఖే సమేకృత్వాలాభా లాభౌ జయా జయౌ'** సుఖ దుఃఖములు రెండు జగత్తుకు సహజమైనవే. ఈ సహజమునకు ఎందుకు వెఱవాలి? ఎందుకు భయపడాలి? దాన్ని ఎదుర్కోవాలి. కారణం ఏమిటని విచారించాలి. దీనికి ఈ reason ఏమిటి? ఈ reason ను చక్కగా గుర్తించుకుంటే ఈ విధమైన మార్పులకు, ఒడుదొడుకులకు అవకాశమే ఉండదు. నిజముగా అన్ని దేశములందు మానవునియందు మానవతా విలువలు లేకపోవటం చేతనే బలహీనత ఏర్పడుతున్నది. ముఖ్యంగా నైతిక విలువ పూర్తిగా క్షీణించిపోయింది. నైతిక విలువ క్షీణించిపోవటంచేతనే, ఈ ధార్మిక విలువ కూడా క్షీణించిపోయింది. నీతి నిజాయితీలు లేవు. సత్యముపై విశ్వాసము లేదు. ధర్మముపైన విశ్వాసము లేదు. ధనముపైన విశ్వాసము పెరిగింది. ధర్మము పైన, న్యాయముపైన, నీతిపైన విశ్వాసము కల్గినప్పుడు ధనముపై మనము విశ్వాసము నిలుపనక్కర లేదు. దానంతట అదే వస్తుంది. Morality పూర్తిగా పోయింది. Money comes and goes; ఎప్పుడు? Morality లేనప్పుడు. Morality ఉన్నప్పుడు money comes and grows. కాబట్టి morality లేకపోవటం చేత money వస్తున్నది, పోతున్నది. Morality పెంచుకున్నప్పుడు ధనము వస్తుంది, పెరుగుతుంది. ధనము పెరగకుండా పోవటానికి మూల కారణము నీతి నిజాయితీలు పోవటమే.

**అధికారమునకు హీరో, నైతిక విలువలకు జీరో**

ఏ రంగములో చూచినా, ఏ వ్యాపారములో చూచినా, ఏ అధికారములో చూచినా, నీతి నిజాయితీలు అనేవి శూన్యముగా ఉంటున్నాయి. అధికారమునకు Hero, morality కి zero. అధికారము చేత నైతిక విలువ పెరగదు. నైతిక విలువ వలన అధికారము పెరుగుతుంది. ప్రతి మానవుడు right కోసం fight చేస్తున్నాడు ఈనాడు. What about responsibility? Responsibility యే చూడటం లేదు. ఏ బ్యాంకు మేనేజరు అయినా తన responsibility తాను చూడటం లేదు. బాధ్యతను విడచిపెడుతున్నారు. కనుక, responsibility ని చక్కగా చేసుకుంటూ పోయినప్పుడు right తనంతట తానే వస్తుంది. నిజంగా

srisathyasaivachanamrutam

చక్కగా విచారించి చూచినప్పుడు ఏ మానవునికి right లేదు. కుంభవర్షము కురిసినప్పుడే కొండల నుండి నదులు ప్రవహిస్తాయి. కానీ, యీనాటి మానవుడు ఆశించేదేమిటి? వర్షము కురవనక్కరలేదు, నదులు ప్రవహించాలి. వర్షములు కురవకుండా నదులు ఎట్లా ప్రవహిస్తాయి? అదే విధముగా మన కర్తవ్యము నిర్వర్తించినప్పుడే మనకు right వస్తుంది. Right అంటే river. Responsibility అనే rain వచ్చినప్పుడే river అనే right వస్తుంది.

**దయగల హృదయమే దైవమందిరము**

విద్యార్థులారా! మీరు కాబోయే పౌరులు. భావిభారతోద్ధారకులు. కనుక మీరు జాగ్రత్తగా మెలగాలి. సమాజమును సంతృప్తి పరచే పనులలో మీరు పాల్గొనాలి. సంపాయించిన ధనము సమాజములో సద్వినియోగ పర్చాలి. సమాజము యొక్క అభివృద్ధికి ధనమును వినియోగించాలి. కానీ అన్నింటికి morality, నైతికమును పెంచుకోవాలి. నీతి లేనివాడు కోతి కంటె చెడ్డవాడు అని సామెత. Mankind అంటున్నారు. కానీ monkey mind గా ఉంటున్నది. Mankind, అనగా kind గా ఉంటుండాలి man. అప్పుడే mankind అంటారు. Kindness లేదు. ఇంక మానవుడు ఏవిధంగా అభివృద్ధికి వస్తాడు? మానవత్వములో హృదయముంటుండాలి. హృత్ + దయ = హృదయ. దయామయుడుగా ఉండినప్పుడే మానవుడు మానవుడుగా రూపొందుతాడు. దయలేని మానవుడు దానవుడనే చెప్పవచ్చును. 'దయగల హృదయమే దైవ మందిరము' కనుక దయామయుడుగా నీవు మారాలి. చదువు లక్ష్యము మానవుని దయామయునిగా మార్చుటమే. ప్రతి మానవుడు expansion love పెంచుకోవాలి. ఈనాడు చదువు పెరుగుతూ ఉంటే contraction love ప్రేమతత్త్వం తగ్గుతుంది. సంకుచితమైన భావాలు పెరిగిపోతున్నాయి. మానవుడు పరిపూర్ణ మానవుడుగా తయారయినపుడు చదువు పూర్తి అయినట్లు. విద్య అనగా జ్ఞానమే. ఎట్టి జ్ఞానము కావాలి? పరిపూర్ణ జ్ఞానము కావాలి. భౌతిక పరిజ్ఞానము కాదు. దీనిని information oriented knowledge అంటారు. ఈ జ్ఞానము వలన ప్రయోజనం లేదు. ఇది గ్రంథపరిచయమే. కానీ, ఆచరణ పూర్వకమైనది Transformation knowledge. అది కావాలి యీనాడు. పరిజ్ఞానము కావాలని ఆశిస్తున్నారు. ఈ పరిజ్ఞానము కేవలం superficial knowledge. కానీ, మీరు superior knowledge, practical knowledge ని

sri sathyasaivachanamrutam

పెంచాలి. అప్పుడే మానవత్వము యొక్క విశిష్టతను పోషించిన వారమౌతాము. విద్యార్థులు ధనము వినియోగము చేసుకునే విధానములో తగిన జాగ్రత్తను వహించాలి. నీకు 10 రూపాయలు ఖర్చుగా ఉన్నపుడు నీవు తల్లిదండ్రులనుండి 9 రూపాయలే ఆశించాలి. అప్పుడే ధనము సద్వినియోగపర్చుకుంటావు. నీకు 10 రూపాయలు ఖర్చుగా ఉంటే 20 రూపాయలు తల్లిదండ్రుల దగ్గర తీసుకుంటే 10 రూపాయలు దుర్వినియోగానికి మూలకారణమవుతుంది. Misuse of money is evil. Don't waste money. Money దైవత్వము, Goddess wealth. ధనము వ్యర్థం చేయకూడదు. కోరికలపై అదుపులో ఇది ఒక భాగము. రెండవది టైమ్ Time is God. Don't waste time. Time waste is life waste. కాలము భగవత్ స్వరూపము. కాలము వ్యర్థం చేయకూడదు. **"కాలాయనమః, కాల కాలాయనమః, కాలదర్పదమనాయ నమః, కాలాతీతాయ నమః, కాల స్వరూపాయ నమః "** అని చెప్పబడినట్లు అంతా కాలమే. పుట్టిన బిడ్డ boy కావాలంటే age కాలమే ప్రధానము. Boy నుండి man కావాలంటే కాలము కావాలి. Man నుండి grandfather కావాలంటే కాలము కావాలి. అన్నింటికి టైమే మూల కారణము. ఈ టైమును మారు దుర్వినియోగం చేయకుండా చూచుకోవాలి. అప్పుడే ధనము దుర్వినియోగపరచుకోరు. ధనము సద్వినియోగ పర్చుకోటానికి మొట్టమొదట కాలాన్ని సద్వినియోగపర్చుకోవాలి. దుర్వసనములతో, దుశ్చింతనలతో, దురభ్యాసములతో మానవుడు అభివృద్ధి అయినప్పుడు ధనము కూడా దుర్వినియోగమవుతుంది. కనుక, ధనము waste చేయకూడదు. ఈ money ఎవరి నుండి వచ్చింది? నీవు సంపాయించింది కాదు. నీ చదువు పూర్తి అయిన తరువాత ధనము సంపాయించవచ్చును. కానీ, చదువు పూర్తి చేసేంతవరకు ఎవరి ధనమిది? తల్లిదండ్రుల ధనము. వారిచ్చే ఒక్కొక్క దుడ్డు తల్లిదండ్రుల ఒక్కొక్క రక్తపు బొట్టుగా మనం భావించాలి. కనుక మీరు ధనమును వ్యర్థం చేస్తే blood ను వ్యర్థం చేసినవారౌతారు. కాబట్టి నీ blood, నీ head, నీ ధనమును, అంతా parent's gift కాబట్టి మొట్టమొదట parents కి gratitude చెప్పాలి. ఈ విధముగా సక్రమమైన మార్గములో నున్నప్పుడు నీవు ధనమును ఏమాత్రము దుర్వినియోగము చేయవు.

**విద్య విజ్ఞానం కోసం, కేవలం కూటికోసం కాదు**

sri sathyasai vachanamrutam

విద్యార్థులారా! ఈనాడు పెద్ద ఉద్యోగాల కోసమని అందరు ప్రాకులాడు తున్నారు. తప్పులేదు. కానీ స్థాయికి మించిన ఉద్యోగాల కోసం ప్రాకులాడటం చేత ధనము దుర్వినియోగమవుతున్నది. నీవు నీ స్థాయి ప్రకారం ఏ పని చిక్కినా దానిని సక్రమంగా చేయి. నీ పాదాలపై నీవు నిలబడే విశ్వాసాన్ని అభివృద్ధి పరచుకో. నేను నిలువ గలవనే ఆత్మ విశ్వాసము పెంచుకో. ఆత్మవిశ్వాసము లేనివాడు ఏ పని సాధించలేడు. విద్య విజ్ఞానం కోసం లభ్యమైనది. కేవలం కూటి కోసం కాదు. కృషి కూటి కోసం. ఉద్యోగం కూడా చేయాలి. దేశముయొక్క అభివృద్ధిని కూడా ఆశించాలి. కానీ, లక్ష్యమును మాత్రము దివ్య మానవత్వముపైన పెట్టుకోవాలి. నీవేదైనా చెడ్డమార్గములో పోయినప్పుడు I am not animal, I am man అని నీవు చింతిస్తూ రావాలి. నీకు కోపం వస్తుంది. కోపం వచ్చినప్పుడు ఎన్నెన్నో మాటలంటావు. ఇతరులను బాధపెడతావు. యితరుల హృదయాన్ని గాయపరుస్తావు. ఆ టైములో నీవు వెంటనే I am not dog, I am man అని గుర్తు తెచ్చుకో. కోపం dog quality, not my quality అనుకో. ఆవిధంగా అనుకున్నప్పుడే ఈ dog qualities దూరమవుతాయి. ఈనాటి పిల్లలు. బ్రహ్మచారి శతమర్కటః అని ఒక్కొక్క బాలుడు నూరు కోతుల బుద్ధి అని. ఆ వయస్సులో ఆలోచనలను నియంత్రిస్తూ రావాలి. I am not monkey, I am man అని ఒక పది సార్లు అనుకొని పనిలో ప్రవేశించు. తప్పక ఈ monkey thoughts పోతాయి. మనస్సును స్వాధీనపర్చుకోటం చేత ఎంతైనా దివ్యమైన కార్యాలు సాధించవచ్చు. కనుక "యోగః చిత్తవృత్తి నిరోధకః" అని పతంజలి సరైన ఆధారము నిరూపించాడు. చిత్తవృత్తిని అరికట్టినప్పుడు ఎంతైనా మీరు సాధించవచ్చును.

**మానవుని సమస్త దుఃఖములకు మూలకారణము ఆశలు పెరిగిపోవడమే**

మానసికతత్వమును మొట్టమొదట అరికట్టుతూ రావాలి. చిన్న ఉదాహరణ పిల్లలకు. ఒక భార్య లేక యిద్దరు భార్యలో ఉంటుంటూనే ఆ మనిషికి చాలా పిచ్చి పట్టిపోతుంది. అటువంటిది ఈ మనస్సుకు 10 మంది భార్యలుంటున్నారు. 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు. ఒక్కొక్కటి ఒక్కొక్క దాన్ని ఆశిస్తూ పోతుంది. కన్ను మంచి లేటెస్ట్ సినిమా చూడాలని ఆశించి అక్కడకు తీసుకువెళ్లు అంటుంది. కన్ను ఈవిధంగా అడుగుతే నాలుక యింకోటి అడుగుతుంది. ఏమండి, నేను రోడ్డులో వస్తున్నప్పుడు మసాలదోశ



sri sathyasai vahini amrutam

వాసన వచ్చింది. కాబట్టి తక్షణం పోయి ఆ మసాలదోస తీసుకుని రావాలి అని కోరుతుంది. దీని మాట వింటాడా, దాని మాట వింటాడా? మనస్సు ఈ విధమైన వాంఛల చేత చాలా జుగుప్సకు గురౌతున్నాది. మీకు తెలుసు. దశరధునికి ముగ్గురు భార్యలు. ఈ ముగ్గురు భార్యలుండటంచేత తాను ఎలాంటి పరిస్థితికి గురయ్యాడు? కట్టకడపటికి ప్రాణమునే కోల్పోయాడు. జ్యేష్ఠపుత్రుడైన రామచంద్రునకు అరణ్యవాసమందించాడు. తన ప్రియమైన భార్య కైకకు తీరని అపకీర్తి వచ్చింది. ముగ్గురు భార్యలుంటేనే యింత అవస్థగా ఉంటున్నది. ఉత్తానపాదునకు ఇద్దరు భార్యలు. ఇద్దరు భార్యలుండటంచేత గుణవంతుడైన కుమారుని అడవికి పంపించాడు. అతడే ధ్రువుడు. ఇద్దరు ముగ్గురుండినప్పుడే ఇన్ని కష్టాలు కలుగుతున్నప్పుడు పదిమంది భార్యలున్న మనసుతో ఏమి సుఖము పొందుతావు? కనుక less luggage, more comfort; make travel a pleasure. కోరికలను కొంతవరకు తగ్గించుకుంటూ రావాలి. ఇదే సంతోషానికి సులభమార్గము. ఈనాటి మానవునకు ఈవిధమైన కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు వెంటాడటానికి కారణం అమితమైన ఆశలు పెరిగిపోవడమే. కొంతమంది నాయకులు కూడా తప్పుచేస్తున్నారు. ఈనాడు ప్రపంచములో రాజకీయ నాయకులు అనుకోండి, విద్యావంతులు అనుకోండి. నాస్తిక నాయకులు అనుకోండి, ఆస్తిక నాయకులు అనుకోండి, ఆస్తిక నాస్తిక నాయకులు అనుకోండి, ఏమైనా అనుకోండి. వీరు సక్రమమైన మార్గమును చూపించటం లేదు. నైతిక, భౌతిక, ఆధ్యాత్మిక, లౌకిక అన్ని రంగాలలో నాయకులు తప్పుడు పద్ధతినే అనుసరిస్తున్నారు. మొట్టమొదట నేను చెప్పాను. 4 F లు అని. 1st F - follow the master. Who is your master? Your conscience is your master. కనుక follow the master, face the devil, fight to the end, finish the game. ఈ నాలుగు చక్కగా నేర్చుకుంటే మీరు ఎంతైనా సాధించగలరు. కనుక, మొట్టమొదట మీ conscience ని follow చేయండి. అదే నీ గురువు. ఏదైనా ఒక పని చేసే ముందు ఆలోచించాలి Is it right or wrong? Is it good or bad? అని టైము తీసుకొని descrimination చేయండి. ఈ descrimination power ఒక్క మానవునికి మాత్రమే ఉంది గానీ జంతువులకు లేదు. కనుక, **'జంతూనాం నరజన్మ దుర్లభం'** అన్నారు. మానవ జన్మ చాలా దుర్లభమైనది. విచారణ చేసి పని

sri sathyasai vachanamrutam

చేసినప్పుడే ఎంతైనా చక్కబడతారు. ఇవంతా గ్రంథముల వల్ల లభించేవి కాదు. Bookish knowledge is only superficial knowledge. తరువాత general knowledge. తరువాత discrimination knowledge. యివన్నీ knowledge లని భావిస్తున్నారు కాని, యివంతా ఎలర్జీలే. Practical knowledge ప్రధానమైనది. నీ అనుభూతికి తగిన దానిని ఆధారంగా తీసుకోవాలి. అట్టి అనుభూతిని అందించేది ఈ conscience. ఈ conscience నీ దేహములో నఖశిఖ పర్యంతము ఉంటున్నది. ఈ conscience ఎక్కడ నుంచి వచ్చింది? Consciousness నుంచి వచ్చింది. సర్వత్రా ఉండిన consciousness ఒక్కో దేహములో conscience గా నిల్చిపోయింది. Consciousness, senses ద్వారా conscience గా మారిపోతున్నాది. Conscience, conscious, consciousness ఈ మూడింటి ద్వారా జీవితాన్ని అనుభవించాలి. దీనినే నేను అప్పుడప్పుడు చెబుతున్నాను. You are not one person, but three - The one you think you are (అదియే conscience); the one others you are (conscious); the one you really are (consciousness). ఇలాంటి పవిత్రమైన మార్గాన్ని అనుసరించినప్పుడు నీవు ఎంతైనా విజయాన్ని సాధిస్తావు.

విద్యార్థులారా! ఈనాడు ఈ ధన విషయమై ఎన్ని మార్పులు జరిగినప్పటికిని ప్రభుత్వము దీనికి ఆధారంగా ఉంది, బ్యాంకు ఆధారంగా ఉన్నాది, కానీ, కొన్ని పరిస్థితిలోపల, ఏ రాజ్యములో కూడను, ఏ స్థితిలో కూడా సరైన balance లేకుండా పోతున్నాది. మానవునకు నాలుగు విధములైన స్థానము లుంటున్నాయి. మొట్టమొదటిది knowledge. ఇది Top level లో ఉంటున్నది. రెండవది skill. మూడవది balance. Balance సరిగా ఉంటున్నప్పుడు insight వస్తుంది. Knowledge,skill, Balance, insight. కానీ ఈనాడు అందరికీ ఉంటున్నది knowledge. ఈ knowledge ని kill చేస్తున్నారు. Knowledge ని kill చేసేటప్పటికి balance తప్పిపోతున్నది. మొట్టమొదట knowledge ని skill చేయాలి. అదియే నిజమైన విద్యావిధానము. మనం నేర్చుకున్న దానిని సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి balance గా చూచుకోవాలి. సక్రమమైన రీతిగా వినియోగించుకోవాలి. అప్పుడే దేశముగానీ, సమాజంగానీ, వ్యక్తిగానీ, కుటుంబముగానీ

sri sathyasai vahanamrutam

అందరు సుక్షేమంగా జీవిస్తారు.

విద్యార్థులారా! అనేకమంది అనుభవజ్ఞులైన వారు వచ్చారు. ఈ మూడు దినములు మీకు ఎన్నియో విలువైన విషయాలు అందిస్తారు. కేవలం విని మాత్రమే ప్రయోజనం లేదు. సాధ్యమైనంతవరకు ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి. ఇలాంటి అనుభవజ్ఞులు అన్ని కాలేజీలకు రారు. Finance రంగంలో నిష్ణాతులు వచ్చారు. వారు దుర్వినియోగమవుతున్న ధనాన్ని సద్వినియోగం ఎలా చెయ్యాలో చెప్పాలని చాలా ఉత్సాహంతో వచ్చారు. వారి హృదయానికి ఆనందమివ్వాలి.

"నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగుటే విద్యయొక్క విజ్ఞత. ఎవరిని మీరు ద్వేషించకూడదు. అందరికి ఉపకారమే చేయాలి. ఏవిధమైన ఉపకారము.

> **ఉపకారికి నుపకారము**
> **విపరీతముగాదు సేయ వివరింపంగన్**
> **అపకారికి నుపకారము**
> **నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ!**

ఎవరు నీకు ఉపకారం చేశారో అతనికి ఉపకారం చేయటం గొప్పతనము కాదు. నీకు ఎవరు అపకారం చేశారో వానికే ఉపకారం చేయాలి. అదే గొప్పతనము. మీరు ఈ జగత్తునందు ఎవరు ఏవిధంగా ఉండినప్పటికిని తగిన ఉపకారము చేస్తూ పోవాలి. ఇదే 18 పురాణముల యొక్క సారము, 'help ever hurt never'. వ్యాసుడు 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం' అని చెప్పాడు. ప్రతి మానవుడు ఈవిధంగా help చేస్తుంటే దేశమంతా సుభిక్షంగా ఉంటుంది. నిత్యము మీరు ప్రార్థన చేస్తుంటారు, 'లోకాస్సమస్తా సుఖినో భవంతు', అందరు సుఖంగా ఉండాలి అని. కేవలం మాటలతో చెప్పినంత మాత్రమున ప్రయోజనం లేదు. ఒకిరిద్దరికైనా ఉపకారం చేసి తగిన శాంతినందించాలి. లోకానికంతా శాంతినందించడం ఎవరి తరమూ కాదు. కనుక, నీవు సాధ్యమైనంత వరకు ఏ కొద్దిమందికైనా ఉపకారము చేసి శాంతి నందించాలి. డబ్బు యొక్క విలువ పడిపోవడానికి ఎన్నెన్నో లోపాలు ఉంటున్నాయి. అవన్నీ బహిరంగంగా చెప్పకూడదు.

sri sathyasai vachanamrutam

అయితే ఈ దోషము ఎక్కడ నుంచి వచ్చిందని విచారణ చేస్తే అన్ని వైపుల నైతిక విలువలు దిగజారిపోవటమే ప్రధాన కారణమని చెప్పవచ్చు. పూర్తిగా ప్రభుత్వము వరకు ఈ జాడ్యము ప్రాకిపోతుంటాది. కోరికలను పెంచుకోటం గొప్పతనము కాదు. తగ్గించుకుంటూ రావాలి. లోకములో అపకారము చేసినవారే గొప్పవారుగా కనిపిస్తుంటారు. ప్రజలంతా దీనినే ప్రశ్నిస్తారు. ఇంత అపకారము చేసినవారిని ఎందుకు శిక్షించకూడదు, ఎందుకు వదలిపెట్టాలి? అని. శిక్షించేది, రక్షించేది నీ బాధ్యత కాదు. ప్రభుత్వము యొక్క నియమ నిబంధనలుంటాయి. ప్రభుత్వము దీనిని ఉపేక్షించవచ్చు. కానీ, దైవశక్తి ఏనాటికీ వదలదు. నేడు కాకపోయినా రేపైనా దీనియొక్క అవస్థలు అనుభవించే తీరుతారు. బాహ్య దృష్టితో చూచినపుడు సందేహములు కలిగినను దైవత్వములో మాత్రం ఏట్టి లోపం లేదు.

## Information తో మనకు ప్రయోజనం లేదు; Transformation కావాలి

నిత్యము బ్యాంకులలో వేల వేల కోట్ల రూపాయలు కాజేస్తున్నారని పేపరులో చదువుతుంటారు. ఇది ఎవరి తప్పు? ఒక్క మనిషి తప్పు మాత్రమే కాదు. ఇన్ని కోట్లు ధనము దుర్వినియోగం చేశారంటే దీనిలో అందరు భాగస్వాములుగా ఉన్నారన్నమాట.అయితే ఇందులో ఎవరిది దోషము అనేది ప్రభుత్వము చూచుకుంటుంది. విద్యార్థి స్థాయిలో మీరు దీని గూర్చి తర్కించకండి. మొట్టమొదట నిన్ను నీవు చూచుకో. Birthday అప్పుడు చెప్పాను. Who are you, who are you అని question వేసుకుంటూ పోతే కేవలం information collect చేసినట్టవుతుంది. ఫలితము లేదు. Who am I. అది transformation. Information తో మనకి ఏమీ ప్రయోజనం లేదు. Transformation కావాలి. ప్రతి విషయమందు విద్యార్థులు చక్కని ఆదర్శప్రాయులుగా నిలవాలి.మంచితనము ఎప్పుడూ సజీవంగా ఉంటుంది. మానవ ప్రయత్నాలు, సాధనలు, సక్రమమైన ఆదర్శంగా నిరూపించాలి. కారణమేమనగా మేము ఒక MBA boys, MFM boys అని మీరు కొన్ని గొప్పగా చెప్పవచ్చు.అయితే మంచి ఆదర్శములతో జీవించడం ప్రధానం.

srisathyasaivacharamrutam

అందరు పిల్లలు ఉండినప్పుడు నేను ఈ ధనము విషయములో అధికంగా బోధించకూడదు. అయితే పాయింటుకు తగిన మాటలు, విషయాలు నేను చెప్పవచ్చును. ప్రపంచమంతా money తో కూడినది. ఈ money తో కూడినది ఈవిధంగా, ఆవిధంగా అని వివరించటం మంచిది కాదు. చాలా secret అయినది. సాధ్యమైనంత వరకు ప్రభుత్వానికి గానీ, ప్రజలకు గానీ, సమాజమునకు గానీ, దేశానికి గానీ ఏవిధంగాను హాని కలుగకూడదు. అందరిలోను తప్పొప్పులు జరుగుతూనే ఉంటాయి. తప్పు, ఒప్పులు లేక మానవుడు జీవించుటకు వీలు లేదు. ఎందువలనంటే తప్పులు జరిగినప్పుడే ఒప్పులు మనకు తెలుస్తుంటాయి. కనుక, వ్యక్తిగతంగా మీలో మీరు చింతించుకొని సుఖదుఃఖాలకు తగిన మార్గం వెతుక్కుంటూ రావాలి. The pleasure is an interval between two pains. ఆనందము రెండు బాధల మధ్యలోనే లభిస్తుంది. బాధలు లేకుండా సుఖాన్ని మీరు పొందలేరు. మార్కెట్టుకి వెళ్లి రెండు కమలాపండ్లు కొన్నావు. కమలాపళ్లు 10 రూపాయలు పెట్టి నేనే కొన్నాను. ఈ 10 రూపాయలు నావి. "వీటిని నేను తినవచ్చు లేక ఎవరికైనా పంచవచ్చు. నాకు స్వతంత్రముంది" అంటావు. అయితే, 10 రూపాయలు ఇచ్చి కమలాపండ్లు కొన్నావే గానీ పై తోలు మాత్రం పారవేయక తప్పదు. పనికి రానిది పారవేయి. పనికి వచ్చేది తీసుకో. ఈ పనికిరాని పై తోలు ఉండటం చేత పనికివచ్చే రసాన్ని రక్షిస్తూ వచ్చింది. కాబట్టి పనికిరానిది, పనికి వచ్చేదాన్ని రక్షించింది. చీకటి లేక వెలుగుకు విలువ లేదు. చీకటి వెలుతురుకు విలువ నందిస్తున్నది. చెడ్డ వలననే మంచికి విలువ. దుర్మార్గము సన్మార్గాన్ని రక్షిస్తున్నది. కనుక **"సుఖదుఃఖే సమే కృత్వా లాభా లాభౌ జయా జయౌ"** అన్నట్లు రెండూ ఉండే తీరాలి. ఇవి లేకుండా ఉండాలని ఆశిస్తే ప్రయోజనం లేదు. నీవు మాత్రం మంచిలోనే ప్రవేశించు.

**స్వార్థమును దూరము చేసుకోండి; దేశం కోసం పాటుపడండి**

విద్యార్థులారా! MBA, MFM విద్యార్థులు ముందు ముందు జగత్తుకు ఉపకారము చేయవలసిన వ్యక్తులు. ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా, నైతికంగా, భౌతికంగా, లౌకికంగా అన్ని

sri sathyasai vahamrutam

విధాలా దేశాన్ని సంరక్షించే విద్యార్థులు. ఇందులో మొట్టమొదట స్వార్థమును త్యాగము చేయాలి. ఎందుకంటే selfishness ఉండినప్పుడు అనేక విధములైన వాంఛలు బయలుదేరుతాయి. ఉద్యోగం చేయండి. అక్కడ ఈ selfishness ను ఉపయోగ పెట్టకండి. అందుకనే చెబుతుంటాను Fish is betterthan selfish. ఎందుకంటే fish నీటిలో సంచరిస్తుంది. నీటిలోని పురుగులను తినేస్తుంది, మాలిన్యమును తింటుంది. నీటిని పరిశుద్ధము చేస్తుంది. Fish is better. ఈ selfish సమాజములో చేరి అంతా dirty చేస్తున్నాడు. Selfishness lives by getting and forgetting. Selflessness ను కాపాడుకోవాలి. అదే అన్ని విధాలా protect చేస్తుంది. స్వార్థమును దూరము చేసుకోండి. దేశం కోసం మీరు పాటుపడండి. జాతీయతాభావాన్ని నిలబెట్టండి. ఈనాటి విద్యార్థులయందు జాతీయతాభావమే కన్పించటం లేదు. ఏదో తన subjects లో మార్కులు రావాలి. మంచి ర్యాంకు రావాలి అని ర్యాంకు కోసం పాటుపడుతున్నారు. మంచిది కాదు. పూర్వము భరద్వాజ మహర్షి దగ్గర సారస్వతుడు అనే శిష్యుడు ప్రవేశించాడు. చక్కని విద్యార్థి. గురువుచెప్పినట్టు ఆచరించేవాడు. ఆనాడు ఎన్ని మార్కులు వస్తే పాసు చేసేవారో తెలుసునా? ఈనాడు 35% వస్తే పాస్. 35% మార్కులు తెచ్చుకుంటే what about 65%. 65% తప్పు చేసినా ఫరవాలేదంటే సరైన విద్య కాదు. నూరు పనులు చేస్తే నూరు పనులు చక్కగా చేయాలి. ఏదో ఒకటి రెండు తప్పినా ఫరవాలేదు. కానీ 65% తప్పు చేస్తే ఎట్లా pass అయినట్లు? ఈ 35 మార్కుల లోపల కూడను grace మార్కులు 5, VC marks 5, education minister marks 5. ఈవిధంగా grace marks ఉంటే ఏమీ చదవనక్కర లేదు. ఈ marks పై depend కాకూడదు. ఆనాడు సారస్వతుడు బాగా ఉత్తీర్ణుడైనవాడు. కానీ, గురువు అంగీకరించలేదు. భారద్వాజమహర్షి శిష్యునితో నీకు డిగ్రీ యివ్వటానికి వీలులేదు అన్నాడు. Convocation వచ్చింది. డిగ్రీ అందించాలి. కానీ ఇవ్వలేదు. బాధపడ్డాడు సారస్వతుడు. తరువాత ప్రత్యేకంగా నీకు డిగ్రీ యిస్తాను, ముందుగా పది మైళ్ళు అడవిలో సంచరించి ఏ వృక్షము, ఏ ఔషధమునకు పనికి వస్తుందో విచారించి రమ్మనాడు మహర్షి. సారస్వతుడు పదిమైళ్ళు అడవిలో సంచరించి వృక్షాలను పరిశీలించాడు, వచ్చాడు. ఈ వృక్షములు ఆరోగ్యమునకు పనికి వచ్చే ఔషధములుగా కనిపించలేదన్నాడు. సరే నీవు

sri sathyasai vahanamrutam

ఫెయిలు అన్నాడు. మరి 20 మైళ్లు పంపించాడు. ఒకటి రెండు మాత్రమే వృక్షములు సరియైనవన్నాడు. అప్పుడు కూడా మార్కులు యివ్వలేదు. తదుపరి సంవత్సరము 50 మైళ్లు విస్తీర్ణములో చూడమన్నాడు. తరువాత సారస్వతుడు వచ్చాడు. సార్! పనికిరాని వృక్షమే లేదు. ప్రతి మూలిక, చాలా అవసరమైనదే, ఆరోగ్యమునకు సంబంధించినదే అన్నాడు. అప్పుడతనికి ఆయుర్వేదము డిగ్రీ యిచ్చాడు భారద్వాజమహర్షి. ఈ ప్రపంచములో పనికిరాని మొక్కలు గానీ చెట్లు గానీ లేవు. అన్నీ పనికి వచ్చేవే. చిన్న గరికపూచ కూడా పనికివస్తుంది. ఇంటి లాన్‌లోని గరిక పోచ కూడా పనికి వస్తుంది. అందులో తెల్లటి గరిక పోచ వస్తుంది. తీరని భేదులను అది నివారణ గావిస్తుంది. తెల్లని గరిక రెండు మూడు తీసుకుని బాగా నమిలి మింగితే భేదులు పోతాయి. ఇంతేకాదు. మన వక్కాకు వేసుకుంటాం. దీనిలో వక్క, ఆకు, సున్నము మూడు ఉంటాయి. సున్నము కాల్షియం, ఆకు blood purify చేస్తుంది. వక్క digest చేస్తుంది. కుక్కను పెంచేవారు వారమునకొకతూరి వక్కను నూరి పాలలో వేసి యిస్తారు. Digest power పెంచుతుంది. పూర్వము వనమూలికలను సద్వినియోగం చేసేవారు. ఆవిధంగా ఉండటం చేత భారతదేశము ఇంత పవిత్రదేశముగా రూపొందుతూ వచ్చింది.

### సంస్కృతి లేని చదువు వలన ప్రయోజనం లేదు

విద్యార్థులారా మీరు నమ్మినా నమ్మకపోయినా అనాదినుండి ఈ దేశములో సహనము, సానుభూతి యిలాంటి పవిత్రమైన గుణాలున్నాయి. ఇంతేకాదు. ఆదర్శవంతమైన దేశమిది. ఈ దేశములోని పవిత్రత మరొక దేశములో లేదు. ఇక్కడి గాలిలో సత్యముంది. ధూళిలో ధర్మముంది. మట్టిలో కరుణ ఉంటున్నది. గంగలో ప్రేమ ఉంటున్నది. మనిషిలో క్షమ ఉంటున్నది. ఈ పవిత్రమైన భూమిలో యింత గొప్పతనము ఉండటం చేత ఆనాడు మ్యాక్స్‌ముల్లర్ భారత దేశములో వచ్చి చావాలని ఆశించాడు. ఇలాంటి మానవత్వానికి తగిన భౌతిక, నైతిక, ఆధ్యాత్మికములు ఎంతైనా ఆదర్శములను నిరూపించే గుణములుండటం చేతనే భారతదేశము ఇంత గొప్పదిగా ఉంటున్నది.



sri sathyasai vahanamrutam

ఇంతేకాదు మనుష్యులందు కూడా ఎంతో పవిత్రత ఉంటున్నది.

**గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి**
**సావిత్రి భారత సతియె కాదె**
**తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె**
**చంద్రమతియు భారతీయ కాదె**
**కులసతీత్వమునకై గుండాన దూకిన**
**సీత భారత ధరజాత కాదె**
**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**
**దమయంతి భారత రమణి గాదె**
**సప్తసాగర పరితోష్ఠితోర్వి తలము**
**భరతజాతి పాతివ్రత్య మహలంబు**
**భావ సంపదకిది మహా పంట భూమి**
**అఖిలదేశాలకిది ఉపాధ్యాయి కాదె**

ఇంత పవిత్రమైనది భారతదేశము. ఇండియాలో మనం పుట్టి మేము భారతీయులము అని చెప్పుకొని, అనవసరంగా విదేశాలను అనుసరిస్తూపోతుంటే మంచిది కాదు. విదేశాలకు వెళ్లండి. ఉద్యోగాలు చేయండి. సంపాయించండి. దోషము కాదు. కానీ మీ మాతృదేశాన్ని మాత్రం మరువకూడదు. ఇదే 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి'. మానవుడు పుట్టిన తక్షణమే తల్లిని చూస్తున్నాడు. తల్లి తండ్రిని చూపిస్తున్నాది. తండ్రి గురువును చూపిస్తాడు. గురువు దైవాన్ని చూపిస్తాడు. తల్లితండ్రి గురువు దైవము ఈ నాలుగు వరుసలో ఉంచటానికి ఒక ఆధారము ఏర్పడింది. కనుక, భారతదేశములో పుట్టిన మీరు భారతదేశ సంస్కృతిని చక్కగా గుర్తించాలి. ఏ దేశములో పుట్టినారో ఆ దేశము యొక్క పరిస్థితిని, ఆ దేశ సంస్కృతిని చక్కగా గుర్తించాలి. మనం ఎన్ని చదువులైనా చదువవచ్చును. Culture లేని చదువు ఏమి ప్రయోజనము? భారతీయ సంస్కృతి ఎంత పవిత్రమైనది. అన్ని దేశాలు మంచివే. ఏదీ నేను చెడ్డదని చెప్పను. కానీ ఉన్నదానిలో పవిత్రమైనది భారతదేశము. ప్రాచీనకాలమునుండి వేదశాస్త్ర ఇతిహాస పురాణముల ప్రమాణములు ఆచరణలో పెట్టి

srisathyasaivachanamrutam

నిరూపించిన దేశం భారతదేశము. ఈనాడు విదేశీయులు భాగవతం చదువుచున్నారు, భగవద్గీత చదువుచున్నారు. కంఠస్థం చేస్తున్నారు కానీ అది art యే గానీ heart కాదు. Art is outside, heart is inside. Art should come from heart ఏది చదివినా heart తో చదవాలి, Artతో కాదు.

## ధనమును వ్యర్థం చేయకూడదు

ఈ కాన్ఫరెన్స్‌కు వచ్చినవారు అనుభవముతో చెప్పేవి కనుక మీరు ఆ వచ్చిన పెద్దల వాక్యములు హృదయములో భద్రము చేసుకొని ఆచరణలో పెడతారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ధనమును మాత్రం వ్యర్థం చేయకండి. ఎందుకంటే దేశము యొక్క పవిత్రత ధనమే కాపాడుతుంది. మీరు ముందు ప్యాసై ఏదైనా business చేయాలనుకుంటే మొట్టమొదట master plan వేయండి. 5 లక్షలతో business ప్రారంభం చేయాలనుకుంటే small scale industries నుండి 6 లక్షలు మాత్రమే అప్పు తీసుకో. 5 లక్షలతో ప్రారంభం చేయి. ఒక లక్ష చేతిలో పట్టుకో. మొదట్లో కొన్ని కష్టాలు నష్టాలు ఉంటాయి. అప్పుడు దాన్ని adjust చేసుకోవచ్చు. దీనికి తగినట్లుగా labour పెట్టుకోవాలి. మీకు తెలుసు. ఇండోనేషియా, South Korea లలో ఒక్కసారి అందరు labours ని ఇంటికి పంపించారు. అప్పుడు అంతా అల్లకల్లోలమై పోయింది. కానీ ఇండోనేషియాలో నైతిక గుణము కల్గిన businessman ఉన్నాడు. అతను స్వామి భక్తుడని నేను చెప్పటం కాదు. అనేక పర్యాయాలు పుట్టపర్తి వస్తాడు. కానీ అతను business మానలేదు. నష్టమైనా ఫరవాలేదు, నగలు, ఇల్లు అమ్మి labour కి జీతాలు యిస్తానని యిచ్చాడు. స్కేలు ప్రకారం ఇస్తూ వచ్చాడు. కష్టాల్ని ఎదుర్కొన్నాడు. ఎవరినీ ఉద్యోగంలోంచి బయటకు పంపలేదు. నేడు అతను గొప్ప పేరును పొందుతూ వచ్చాడు. మీకు అవసరమైనప్పుడు లేబర్సును ఎక్కువగా తీసుకోవటం, తక్షణమే తీసివేయటం మంచిది కాదు. నీవు మొట్టమొదటే విచారణ చేసి ఎంతమంది కావాలి, ఎంతమందిని నేను భరించగలను, ఎంతమందికి యిక్కడ work ఉంది అని చూసుకోవాలి. తగినంత మాత్రమే ఎన్నుకోవాలి. ఎక్కువమంది అయితే పని తగ్గిపోతుంది. Salaries ఎక్కువైపోతాయి. నేను అప్పుడప్పుడు చెబుతుంటాను. Talk less work more అని. ఆవిధంగా మీరు తగినంత

srisathyasaivachanamrutam

మనుష్యులను పెట్టుకొని పనిచేయించుకోవాలి. ఎవరిని తీసివేయవద్దు. ఆ విధమైన morality కి నిలబడితే ఎంతైనా అభివృద్ధి అవుతుంది. నీవు ఒక factory లో చేరిన తర్వాత నీకు పనిలేదు పొమ్మంటే నీవు ఎంత బాధ పడతావు? కనుక, యితరులు కూడా ఆవిధంగా బాధపడతారని ఆ సత్యాన్ని నీకు నీవు పోల్చుకోవాలి. నా బాధ ఎట్టిదో ఎదుటివారి బాధ అట్టిదే అని తెల్చుకోవాలి. నా సంతోషము ఎట్టిదో నీ సంతోషము అట్టిదే అనేది compare చేసుకోవాలి. అప్పుడు నీవు బాగుపడతావు యితరులను బాగుపరుస్తావు.

**విశాలమైన ప్రేమతత్త్వమును పెంచుకోండి**

విద్యార్థులారా! విశాలమైన ప్రేమతత్వాన్ని పెంచుకోండి. Expansion love రావాలి మీలో. Expansion love is life contraction love is death. ఈ రకముగా మీరు భావించుకొని ఎంతైనా ఉద్ధారము చేసుకొని భారతదేశమే కాక ఇతర దేశాలకు కూడా వెళ్లి తగిన ఉత్సాహప్రోత్సాహాలన్నీ అందించాలని ఆశిస్తున్నాను. **మీకు ఇంకా details కావాలనుకున్నప్పుడు మీ మీ క్లాసులలో ఎంతైనా details యిస్తాను. మీరు అనుకోవచ్చు, సాయిబాబాకు business ఏమీ తెలియదని. నాకు తెలియనిది ఒక్కటీ లేదు.** మీకు ఒక్కమాటలో చెప్పాలంటే awareness. చూడండి ఈ కర్చీఫ్ అంతా మూసుకొని యింత చూపి what is this అంటే piece of cloth అంటారు. కానీ ఇది సత్యము కాదు. That is not awareness. పూర్తిగా విప్పి what is this అన్నప్పుడు This is kerchief అంటారు. This is awareness. Total understanding is awareness. కానీ ఎవరెవరికి ఏది అవసరమో అదే చెప్పాలి. ప్రపంచమునకు అపకారము చేసేది నేను ఎప్పుడూ చెప్పను. అంతా ఉపకారమే నేను చెబుతాను. శ్రేయస్సే చెప్పాలి, సౌభాగ్యమే చెప్పాలి. సద్వినియోగమే చెప్పాలి. కనుక, మీరు విడిగా వచ్చినప్పుడు ఎంతైనా నేను చెబుతాను. ఏమీ తెలియని పిల్లలకు చెప్పినప్పుడు వారు దానిని సరిగా అర్థము చేసుకోలేరు. మీ Finance management లోపల ఎక్కువగా నేను ప్రవేశించకూడదు. చాలామంది అనుభవజ్ఞులు వచ్చారు. వారు చెబుతారు. మీరు చక్కగా హృదయములో చేర్చుకొని భవిష్యత్తుకు చక్కగా వినియోగం చేసుకుంటూ రండి. అయితే, మొట్టమొదట Truth and morality. ఈ రెండిటిని మీరు భద్రం చేసుకోవాలి. అది ఎప్పటికి శాశ్వతంగా నిచ్చేవి. Body is like a water bubble. ఇది

sri sathyasai vachanamrutam

ఏ క్షణంలోనైనా పగిలిపోతుంది. Mind is a mad monkey. దీన్ని follow చేయకండి. Conscience ని follow చేయండి. అదియే మీ లక్ష్యము. చాలా ఆనందము

విద్యార్థులారా! మీరు అందరు ఎంతో గొప్ప ఆదర్శము నిరూపించి దేశమునకు ఆదర్శప్రాయులుగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. దేశానికి మాత్రమే కాదు ఇంటిలో కూడా ఆదర్శంగా ఉండాలి. తల్లిదండ్రులకు తగిన ప్రీతిని అందించాలి. గ్రామానికి, ప్రాంతానికి కూడా తగిన సహాయం చేయాలి. ఈవిధంగా కొద్ది కొద్దిగా పెంచుకుంటూ పోవాలి. భారతదేశంలో 98 కోట్ల మంది ఉంటున్నారు. వీరందరు ఏకం కావాలంటే ఏమి చేయాలి? I + + .... పెట్టుకోండి అందరు ఒక్కటై పోతారు. Unity is purity. Purity is divinity. దాన్ని దృష్టిలో ఉంచుకోండి.

**(తేదీ 03-12-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam